కుందుగారి రాంరెడ్డికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ సీనియర్ నేత

గుమ్మడిదల, డిసెంబర్ 21: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పార్టీ విధి విధానాలు నచ్చక బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందుగారి రాంరెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా, రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా అందరినీ మభ్యపెట్టిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా బీఆర్ఎస్ అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఆంజనేయులుయాదవ్, నాయకులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిరుమని శ్రీనివాస్, కవ్వం మల్లారెడ్డి, నల్ల రాజుగౌడ్, నల్ల రవిగౌడ్, యాదగిరి, పెంటయ్య ఉన్నారు.

వార్డుల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం డిసెంబర్ 21: ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ వార్డుల అభివృద్ధే లక్ష్యంగా కృషి పని చేస్తున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కేబీఆర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల కనీస అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ బీరప్పయాదవ్, ఏఈ కిష్టయ్య, సిబ్బంది ప్రశాంత్, కాలనీవాసులు జనార్దన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: చైతన్యవంతుడైన వినియోగదారుడు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోగలడని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తారా కళాశాల కన్జూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి సందర్భంలోనూ మనిషి వినియోగదారుడే అని పేర్కొన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సమన్వయకర్త వీరేందర్, వాణిజ్య విభాగధిపతి జ్యోతి, అధ్యాపకులు సాజిదా, సంగీత, ఉమా, కరుణ, సావణ్య, శ్యామ్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోహీర్, డిసెంబర్ 21: మనియార్‌పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై సతీశ్ వెల్లడించారు. శనివారం రాత్రి నమ్మదగిన సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. వారి నుంచి రూ.10,400, నాలుగు బైకులు, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

ఖేడ్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్, పంచాయతీ కార్మికులు

నారాయణఖేడ్, డిసెంబర్ 21: పంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు మూడు నుంచి ఏడు నెలల వరకు జీతాలు పెండింగ్ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్, పంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దర్గా ఉర్సు

కోహీర్, డిసెంబర్ 21: కోహీర్ పట్టణంలోని హజ్రత్ మౌలానా మోహీజొద్దీన్ తుర్కి దర్గా 766వ ఉర్సు శనివారం ముగిసింది. ఉర్స్ సందర్భంగా కవ్వాలీ నిర్వహించారు. కళాకారులు ఆలపించిన కవ్వాలీ అందరినీ ఆలరించింది. ముగింపు సందర్భంగా పలు పార్టీల నేతలు దర్గాను సందర్శించి చాదర్‌ను సమర్పించారు. ఉర్సును విజయవంతం చేసినందుకు మాజీ ఎంపీపీ, కమిటీ అధ్యక్షుడు శౌకత్‌అలీ, ఉపాధ్యక్షుడు ఎజాజ్ బండారీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర పూలె అవార్డు గ్రహీత జ్యోతిపండాల్, శ్రీనివాస్‌గౌడ్, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ పోల్‌పై యువకుడి హల్‌చల్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: హైటెన్షన్ పోల్ పైకి ఎక్కిన ఓ యువకుడు పోలీసులకు చుక్కలు చూపించాడు. శనివారం పట్టణంలోని రాజంపేటకు చెందిన వెంకట్ విద్యుత్ కార్యాలయం వద్ద గల హై టెన్షన్ పోల్‌పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులు ఎంత వారించినా కిందికి దిగలేదు. తన కుటుంబ సభ్యులతో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వస్తేనే దిగుతా అని పట్టుపట్టాడు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కిందికి దిగివచ్చాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

గుండ్లమాచునూర్ శివారులోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలు

హత్నూర, డిసెంబర్ 21: మండలంలోని గుండ్లమాచునూర్ శివారులోప్రధానరహదారిపై గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్–సంగారెడ్డి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటున్నది. చిన్నచిన్న వాహనాలు, ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై పడ్డ గుంతలను తప్పించబోయి అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి గుంతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రపంచ మేధావి శ్రీనివాస రామానుజన్

హత్నూర: జాతీయ గణిత దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఝరాసంగం, డిసెంబర్ 21: ప్రపంచం గర్వించదగ్గ మేధావి శ్రీనివాస రామానుజన్ అని, మానవ మనుగడ గణిత శాస్త్రంపై ఆధారపడి ఉందని ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జీర్లపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు మురళి మోహన్, శ్రీనివాస్, మంజూల, అడివప్ప పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణితంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ నిత్య జీవితంలో గణిత ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు గణితంలో పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, గణిత విభాగాధిపతి డాక్టర్ సుజాత, అధ్యాపకులు డాక్టర్ సరళ, సల్మోన్ రాజు, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

హత్నూరలో..

హత్నూర, డిసెంబర్ 21: జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రం ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణితంపై భయం వీడాలన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, డిసెంబర్ 21: గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఏఎస్ విద్యావిహార్‌లో గణిత శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.శనివారం మండలంలోని ఏఎస్ విద్యావిహార్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ మీనా, కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు గణితశాస్త్రానికి సంబంధించిన వివిధ రకాల 60 నమూనాలను ప్రదర్శించారు.

సంగారెడ్డి కలెక్టరేట్: గణితం ప్రాముఖ్యతను వివరిస్తున్న తారా కళాశాల గణిత విభాగధిపతి సుజాత

గుమ్మడిదల: గణితశాస్త్రంలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మునిపల్లి: బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

క్రీడల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థినులు

జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థినులు

మునిపల్లి, డిసెంబర్ 21: మండలంలోని బుధేరా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు క్రీడాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిసెంబర్ 16నుంచి 21 వరకు సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో బుధేరా మహిళా డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న పలువురు విద్యార్థునిలు స్వర్ణ, రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మహిళా డిగ్రీ కళాశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు తిసుకువచ్చిన విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, కళాశాల ఫిజికల్ డైరక్టర్ రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

జహీరాబాద్, డిసెంబర్ 21: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌డీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆగస్టు ఒకటో తేదీన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో మాదిగ ఉపకులాలు విద్య, ఉద్యోగ, అర్థిక, రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. జనవరి 27వ తేదీలోగా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, లేని పక్షంలో వెయ్యి గొం తులు, లక్ష డప్పులతో ట్యాంకు బండ్‌పై కవాతు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర మంత్రి వర్గంలో అదనంగా మాదిగలకు చోటు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు కవితామాదిగ, జిల్లా అధ్యక్షురాలు పెద్ద గీతమాదిగ, జహీరాబాద్ నియోజవర్గ అధ్యక్షుడు అబ్రహంమాదిగ, మహాజన సోషలిస్టు నాయకులు పల్లవి, ఉల్లాస్, రవికుమార్, చింటు, సంజీవ్, సుదీప్, సుకుమార్, స్వరాజ్, సురేశ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఏవీఎన్ఎల్ డైరెక్టర్ పట్నాయక్, ఓడీఎఫ్ సీజీఎం ఎస్.ఎస్ ప్రసాద్

కంది, డిసెంబర్ 21: మండలంలోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్) శరత్ సేడియంలో ఐదు రోజులుగా కొనసాగిన ఏవీఎన్ఎల్ చైర్మన్స్ కప్ 2024 క్రీడా పోటీలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ఏవీఎన్ఎల్ హెచ్ఆర్ డైరెక్టర్ బి.పట్నాయక్, ఓడీఎఫ్ సీజీఎం ఎస్.ఎస్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలు రాష్ట్రాలకు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన టీంలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉద్యోగులు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పీడీకి సన్మానం

పీడీ షర్ఫొద్దీన్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవో జిల్లా నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: సుధీర్ఘాలం విద్యార్థులకు ఆటపాటల్లో తర్ఫీదు ఇచ్చిన పీడీ షర్ఫొద్దీన్‌ను టీఎన్‌జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీఎం కప్ ఆటల పోటీల ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక బీఆర్ అంబేద్కర్ మైదానంలో శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న షర్ఫొద్దీన్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. మండల, జిల్లా స్థాయి క్రీడల్లో తనదైన ముద్ర వేసుకున్న పీడీ పదవీ విరమణ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఖాసీంబేగ్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, కార్యదర్శి రవి, అసోసియేషన్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కోశాధికారి గౌస్ హాస్మీ, నాయకులు రవికృష్ణ, కృష్ణ, నర్సింలు, పీడీలు, పీఈటీలు తదితరులు సన్మానించారు.

అనంత పద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు

పద్మనాభ స్వామిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ నేత మఠం భిక్షపతి

చౌటకూర్, డిసెంబర్ 21: మండలంలోని చక్రియాల లక్ష్మీ అనంత పద్మనాభ స్వామిని బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి దర్శించుకున్నారు. శనివారం సర్పంచ్‌ల ఫోరం ఉమ్మడి పుల్కల్ మండల మాజీ అధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డితో కలిసి ఆలయన్ని సందర్శించారు. ఆలయ ప్రాముఖ్యతను ఆలయ ప్రధాన అర్చకుడు మహారాజుల రామకృష్ణ శర్మ వివరించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలందిస్తానని తెలిపారు. ఆలయం పక్కనే ఉన్న పురాతన కోనేరును అభివృద్ధి చేయాలని ఆలయ కమిటీకి సూచించారు. ఆలయ కమిటీ పాలకవర్గం చైర్మన్ భానూరి లక్ష్మణ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, సత్యనారాయణలు భిక్షపతిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు ఆయనను సన్మానించారు. సుల్తాన్‌పూర్ మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, నాయకులు ముద్దాయిపేట సతీశ్‌కుమార్, కప్పాటి శ్రీనివాస్, తుంగె రాజమల్లేశం, కోర్పోలు రవి, వడ్డె ప్రకాశ్, ఆర్.మల్లేశం, మల్లారెడ్డి, నాగరాజు, అందోలు పాండు, గాజుల చెన్నయ్య ఉన్నారు.

రొమ్ము క్యాన్సర్ పరీక్షలు అభినందనీయం

వైద్య పరీక్షలు చేయించుకున్న మున్సిపల్ కార్మికులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రామచంద్రాపురం, డిసెంబర్ 21: మున్సిపాలిటీ సిబ్బందికి రొమ్ము క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ ఆవరణంలో ఏఐజీ దవాఖాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాన్ని ఏఐజీ హెచ్‌వోడీ ప్రజ్ఞా చిగురుపాటితో కలిసి ప్రారంభించారు. మహిళా కార్మికులకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏండ్ల పైబడిన మున్సిపాలిటీ మహిళా కార్మికులకు ఏఐజీ దవాఖాన, గ్రాన్యువల్, టీనా, తెల్లాపూర్ మున్సిపాలిటీ సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే, నిర్మాణ దశలో ఉన్న సమీకృత మార్కెట్, పంక్షన్ హాల్, మహిళా శక్తి క్యాంటిన్, యూజీడీ పనులు, పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ సంగారెడ్డి, వైద్యులు శ్రీనివాస్‌మూర్తి, టీనా అధ్యక్షుడు రమణ, అమూల్య, ఏఐజీ దవాఖాన బృందం అమిత్‌కుమార్‌చౌదరి, అశోక్‌ప్రధాన్, త్యాగరాజన్, డీఈఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

నారాయణఖేడ్, డిసెంబర్ 21: జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నారాయణఖేడ్‌లో జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి లలితకుమారి మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా గురించి వివరించారు. ప్రమాద పరిస్థితుల్లో ఉన్న బాలికలు 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఆర్డీవో అశోక చక్రవర్తి మాట్లాడుతూ బాలికల విద్య, మహిళా సమానత్వం, మహిళా సాధికారత కోసం బాలికలు ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదవరెడ్డి, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి పాల్గొన్నారు.

రాళ్లకత్వ పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న రాళ్లకత్వ యువకులు

బొల్లారం, డిసెంబర్ 21: జిన్నారం మండలం రాళ్లకత్వ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ యువజన సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ రఘును కలిసి ఫిర్యాదు అందజేశారు. కార్యదర్శి గుట్టుచప్పుడు కాకుండా అక్రమాలకు పాల్పడుతూ ఎన్‌వోసీలు ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి రావడం లేదని, క్రషర్ల యజమానులతో, బ్యాటరీ రీసైక్లింగ్ ఫ్యాక్టరీ యజమానులతో వ్యవహారాలు నడుపుతున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆది రామకృష్ణ, జింక గణేశ్, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భుపాల్‌రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 21: మండల పరిధిలోని మునిగెపల్లికి చెందిన పుట్టి సత్యమ్మ దవాఖాన ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.30 వేల చెక్కును శనివారం వారి కుమారుడు పుట్టి కాశీరాంకు మాజీ ఎమ్మెల్యే భుపాల్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ నవాబ్‌పాటిల్, నాయకులు మన్నె లింగం, కుక్కల గంగారాం, మచ్చురి అల్లమయ్య, సాయిలు ఉన్నారు.

బడి పిల్లలతో కారు వాషింగ్!

మునిపల్లి, డిసెంబర్ 21: మునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో కారును విద్యార్థులతో కడిగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఒక కారును రెంట్‌కు తీసుకొని అదే కారులో ఉపాధ్యాయులు రోజూ పాఠశాలకు వస్తుంటారు. రెండు రోజుల క్రితం విద్యార్థులతో రోడ్డు పక్కన విద్యార్థులతో కారు కడిగించారు. ఈ అంశాంపై 'నమస్తే తెలంగాణ' పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెబుతూ మరోసారి పునరావృతం కానివ్వమని చెప్పారు. విద్యాధికారి పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోశాలలో ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, డిసెంబర్ 21: గోరక్షా సమితి ఆధ్వర్యంలో నందిగామ గోశాలలో ఏర్పాటు చేసిన పూజలకు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ హాజరయ్యారు. శనివారం పటాన్‌చెరు మండలం నందిగామలోని గోశాల నిర్వాహకులు, గోరక్షా సమితి ఆధ్వర్యంలో ఆవుతల్లి పేరున ఒక రోజు కార్యక్రమం నిర్వహించారు. హాజరైన కార్పొరేటర్ అక్కడ నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరక్షా సమితి సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.

మున్సిపాలిటీగా కోహీర్ వద్దు

కోహీర్, డిసెంబర్ 21: కోహీర్ గ్రామ పంచాయతీని కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీటీసీ అనితాసంపత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కోహీర్‌లోని ప్రజలందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, స్థానికంగా ఒక్క పరిశ్రమ కూడా లేదన్నారు. 900మందికి ఈజీఎస్ జాబ్ కార్డులుండగా 600 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారని చెప్పారు. అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నారని తెలిపారు. కోహీర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే ఉపాధిహామీ కూలీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇంటి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2 లక్షల వరకు అవుతుందన్నారు. ఇంటి నిర్మాణ అనుమతికి మరో రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కలిగే నష్టాలను గుర్తించి మున్సిపాలిటీగా కోహీర్‌ను ఏర్పాటు చేయొద్దని కోరారు. కోహీర్‌ను అభివృద్ధి చేయడం చేతకాని వాళ్లు మాత్రమే మున్సిపాలిటీ కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ పెడితే నిజాలు తెలుస్తాయన్నారు.

ఉచితంగా 'సిటిజన్ ఆన్‌లైన్ సేవలు'